అమరవీరులారా..
మీ త్యాగం మరువగలమా?

అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవానికి తరలిన నేతలు

మూసాపేట: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమరవీరుల స్మారక చిహ్నాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ప్రతి డివిజన్ నుంచి పార్టీ నాయకులు బైక్, బస్సు ర్యాలీలుగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలి వెళ్లారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు తెలుపుతూ బయల్దేరారు.




ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్లు బాబూరావు, శ్రావణ్‌కుమార్




తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

- అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ నివాళి

అల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రతి తెలంగాణ బిడ్డ వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి ఉద్యమకారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ఎంతో మంది అమరవీరుల త్యాగాల ఫలితంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలు వదలిన అమరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు చాటి చెప్పాలన్నారు.

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలో అమరవీరుడు రాజారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డీసీ రవికుమార్, కోఆర్డినేటర్ సతీష్ అరోరా కలిశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. అనంతరం రాజారెడ్డి భార్య మాట్లాడుతూ.. 2012 మిలియన్ మార్చ్‌లో మరణించిన రాజారెడ్డి తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత ప్రభుత్వం ఉద్యోగం కల్పించిందన్నారు. ఉద్యోమకారులను ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి కష్టం వచ్చినా రాజారెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అమరవీరుల, ఉద్యమకారుల కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నాయకులకు ఘనంగా సన్మానించారు.


తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న మూసాపేటలోని పంచశీల స్కూలు విద్యార్థులు

తెలంగాణ ఉద్యమ వీరులకు నివాళులు

మూసాపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్‌లో ఉన్న ఆచార్య జయశంకర్ విగ్రహానికి, మలిదశ ఉద్యమంలో అమరుడైన రాజారెడ్డి చిత్రపటానికి గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిలియన్ మార్చ్‌లో అమరుడైన రాజారెడ్డి త్యాగం మరువలేనిదని అన్నారు. ఆరు దశాబ్దాల ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ప్రొ.జయశంకర్ సార్ అని కొనియాడుతూ అశ్రునివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, డీసీ రవికుమార్, కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మెడికల్ ఆఫీసర్ సోలోమన్, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, సీనియర్ నాయకులు దేవాది హరినాథ్, ధర్మారావు, భూమండ్ల అశోక్, ఈదులకంటి అశోక్, శ్రీకాంత్, వెంకట్, చెరుకు సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




అమరవీరుడు రాజారెడ్డి చిత్రపటానికి, ప్రొ. జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మూసాపేట: ఫతేనగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన, ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి భరత్‌నగర్‌పార్కు యోగా భవన్ ప్రారంభం, దీన్‌దయాల్‌నగర్‌లో వర్షం నీటి డ్రెయిన్ 900ఎంఎం డయా బ్రిడ్జి నిర్మాణం, కైత్లాపూర్ బ్రిడ్జి కల్వర్టు నుంచి స్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు, బాలానగర్ మెయిన్ రోడ్డు నుంచి అక్షయ ఎన్‌క్లేవ్ పార్కు వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 12మందికి గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు రావాలంటే ఎంతో కాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు మనకు ఆ పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలు అర్జి పెట్టుకున్న వెంటనే పరిశీలించి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంజూరు చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు 4వేల మందికి పైగా చెక్కులు అందజేశామన్నారు.

ఉద్యమకారుడు సీఎంగా ఉండటం ప్రజల అదృష్టం

మోతీనగర్: ఎంతోమంది త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ వార్డు కమిటీ కార్యాలయంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులను బీఆర్‌ఎస్ పార్టీ కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. తాము ఎన్నో వ్యయప్రయాసాలు కోర్చి ఉద్యమంలో పాల్గొన్నామని అన్నారు. ఉద్యమకారుడు ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాయకులు కొండం సంపత్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సి. బ్రహ్మ, యోగిరాజ్, సంజీవరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, రాజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసకాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, సంఘమిత్ర స్కూల్ వద్ద చేపడుతున్న యూజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు రమేష్, హనుమంత్‌రావు, సుబ్రహ్మణ్యం, విజయ్, ప్రదీప్, శివరామ రాజు, అశోక్, సచిన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, ఖదీర్, ఎండీ రషీద్, సుశీల్, భాస్కర్‌రావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా సంఘాల నాయకులు ఎం. శంకర్, సీఐటీయూ మండల కార్యదర్శి కృష్ణనాయక్ తదితరులు హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 కేంద్రాల్లో 48వేల మంది పేదలు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసి సంవత్సరం నుంచి ఉంటున్న వారికి అక్కడే పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 27 వరకు 17 జిల్లాల్లో 61 కేంద్రాల్లో బస్సు యాత్ర నిర్వహించి ఇబ్రహీంపట్నంకు చేరుకుంటుందని తెలిపారు. కూకట్‌పల్లి మండలంలో ఈనెల 25న రిలే నిరాహార దీక్షలు, 26న మండల కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమాలో రాజుల రాము, ధర్మారావు, శ్రీను, వెంకటేష్, మహేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర

బాలానగర్: బాలానగర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర గురువారం 23వ రోజు విజయవంతంగా సాగింది. ఫిరోజ్‌గూడ మెయిన్‌రోడ్‌లో భారత్ లాడ్జ్ నుంచి గీతానగర్ మీదుగా నవజీవన్‌నగర్ వరకు బీజేపీ నాయకులు పర్యటించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... 9 ఏళ్ల ప్రధాన మంత్రి మోదీ పాలన గురించి ప్రసంగించారు. ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్కనపల్లి సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, రాష్ట్ర మాజీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, కార్యవర్గ సభ్యులు మధ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి

కూకట్‌పల్లి: విద్యా రంగ సమస్యలపై ఏబీవీపీ నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఛత్రపతి చౌహాన్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఏ విధంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని ప్రశ్నించారు. అదే విధంగా రాష్ట్రంలో పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో నిధులు లేక నియామకాలు జరగక... స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల కాక... విద్యార్థులు తీవ్ర నష్టాలకు గురవుతుంటే.. మరో వైపు కార్పొరేట్ ప్రైవేట్ విదాసంస్థలు విద్యార్థుల నుంచి లక్షల ఫీజులు వసూలు చేస్తూ పట్టి పీడిస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోవటం లేదన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజ్‌తో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగితే బోర్డును ఎటువంటి ప్రక్షాళన చేయకుండానే మళ్లీ అదే బోర్డు నేతృత్వంలో పరీక్షలు నిర్వహించటం గమనార్హమన్నారు. వెంటనే పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర్ కార్యదర్శి ఆకాష్, రాఘవేందర్, ఆయుష్, సంజయ్, మోక్షజ్ఞ, కరణ్, సిద్ధార్థ, ఆంజనేయులు, నిఖిల్, రమేష్ భారత్, తదితరులు పాల్గొన్నారు.

ఇందూ విల్లాస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఇందూ విల్లాస్‌లో అసోసియేషన్‌సభ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అండర్‌పాస్ బ్రిడ్జి దగ్గర ఇందూ విల్లాస్ మీదుగా వచ్చే రహదారిని మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా వీధిలైట్లు, చిన్న చిన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ట్రాఫిక్ సీఐ నరసింహారావుకు తెలిపారు.

ప్రజాధనం దుర్వినియోగంపై కాంగ్రెస్ నిరసనలు

- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం
- ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతున్నారని వ్యాఖ్య
- జీసీ రుణం పేరిట కొత్త నాటకం మొదలెట్టారని విమర్శ


ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం నిధులు వెచ్చిస్తూ... బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపడుతోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, పీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవాలకే క్రమంలో బీసీ సహాయం పేరుతో ప్రజలను కొత్తగా మభ్య పెడుతోందన్నారు. అనంతరం ప్రజాధనం దుర్వినియోగంపై కూకట్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, గూడెపు నాగరాజు, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్‌మిస్బా, సునీల్ యాదవ్, మహిళా బీ-బ్లాక్ అధ్యక్షురాలు శోభా, రజిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి...

దశాబ్ది ఉత్సవాల దగా పేరుతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం బాలానగర్ చౌరస్తాలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక వాగ్దానాలు ఇచ్చి నెరవేర్చడంలో విఫలమయ్యిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తహసీల్దార్ అహల్యాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమేష్, క్రిష్ణా రాజపుత్, బండారి నవీన్ గౌడ్, తూము వేణు, నల్లోల రాజేందర్, మట్టే ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.